క్లుప్తంగా

పీపీకి సన్మానం



చిట్యాల : జిల్లా కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా నియమితులైన మండలంలోని భావ్‌సింగ్‌పల్లికి చెందిన నిమ్మల విష్ణువర్ధన్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానికులు మంగళవారం పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ దామరబోయిన నారాయణరావు, మాజీ సర్పంచ్ బండి రవి, నాయకులు మురారి నరేందర్, గాజె నారాయణ, మేరుగు సదానందం, చిందం సమ్మయ్య, జయ్యారపు పోషయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు..



కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, మజీద్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు రామగుండం రామ్మూర్తి, శ్రీపాల్‌లను తోటి ఉపాధ్యాయులు కాళేశ్వరం పాఠశాలలో మంగళవారం పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, రాజు, లక్ష్మి, శ్యామ్ పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక



భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న జేసీ రాజు అరుముళ్ల తెలుగు వెలుగు జాతీయ జ్యోతిరావు పూలే అవార్డుకు ఎంపికైనట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తములను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగే వేడుకల్లో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

రోడ్డు మరమ్మతుకు రూ.కోటి మంజూరు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల–కొయ్యూరు నాగులమ్మ వరకు నిర్మించిన డబుల్ రోడ్డు మరమ్మతు కోసం జెన్‌కో ద్వారా రూ.కోటి మంజూరైనట్లు ఆర్ అండ్ బీ ఏఈ అవినాష్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పెద్దతూండ్ల ఇప్పల క్రాస్ నుంచి తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం వరకు దెబ్బతిన్న ప్రదేశాల్లో ప్యాచ్ వర్క్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆ రోడ్డును ఎస్ఈ నాగేందర్‌రావు మంగళవారం పరిశీలించినట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.స్పష్టం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మల్హర్ : మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన బిర్క ప్రవీణ్‌కు రూ.8 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరుగా కాగా ఆయనకు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మల్క సూర్యప్రకాష్‌రావు, బీఆర్ఎస్ పార్టీ తాడిచర్ల గ్రామ శాఖ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ మల్క రాజేశ్వర్‌రావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బూడిద సదానందం, నాయకులు రమేష్, బూడిద సతీష్, సదానందం, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్‌కు అస్వస్థత



చిట్యాల : మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బాపురావు విధి నిర్వహణలో అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పరకాల డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్న బాపురావు సోమవారం మధ్యాహ్నం స్వల్ప జ్వరం ఉన్నప్పటికీ అధికారులు సెలవుకు అనుమతించకపోవడంతో చేసేది లేక పరకాల నుంచి టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లి (బి) రూట్‌లో నైట్‌హాల్ట్ డ్యూటీకి వెళ్లాడు. రాత్రి అక్కడే బస చేసి మంగళవారం ఉదయం బయల్దేరగా మార్గమధ్యలోనే బాపురావుకు జ్వరం ఎక్కువైంది. దీంతో బస్సు నడపలేకపోయాడు. అనంతరం ఆయన్ను చిట్యాల మండల కేంద్రంలోనే బస్సును నిలిపేసి ఆస్పత్రిలో కండక్టర్ చేర్చాడు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో మరో డ్రైవర్‌ను పంపించి బస్సును యథావిధిగా నడిపించారు.

హనుమాన్ ఆలయంలో ఎక్కాహం

మహాముత్తారం : శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని బోర్లగూడెంలోని హనుమాన్ ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఆనవాయితీ ప్రకారం ఎక్కాహం ప్రత్యేక భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, భక్త మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య రక్షణే ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పీహెచ్‌సీల్లో మంగళవారాల్లో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారి నాగరాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వం పథకాన్ని రూపొందించిందని తెలిపారు. పథకంలో మధుమేహం, స్క్రీనింగ్, థైరాయిడ్, సంతాన, ఇతర సమస్యలపై చికిత్స అందించి మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సుజాత, జిల్లా వైద్యాధికారి శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య, చిట్యాల మార్కెట్ చైర్మన్ రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అన్నారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు, వైస్ ఎంపీపీ రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ పాలనకు ఆకర్షితులై చేరిక'



పార్టీలో చేరిన వారితో పుట్ట మధు, శ్రీహర్షిణి

కాటారం : బీఆర్ఎస్ పాలనకు ఆకర్షితులై పలువురు చేరుతున్నారని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ అభ్యర్థి పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్ తెలిపారు. మండలంలోని మద్దులపల్లికి చెందిన సుమారు 20 మంది కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరగా వారికి మధు, శ్రీహర్షిణి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం మధు, శ్రీహర్షిణి మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న చాకలి ఐలమ్మ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, సర్పంచ్ తోట రాధమ్మ, ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు ముక్తి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ రాంనర్సింహారెడ్డి

భూపాలపల్లి అర్బన్ : ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలని సీఐ రాంనర్సింహారెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆటో యూనియన్ కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఆటోడ్రైవర్లు ఖాకీ చొక్కా ధరించి డ్రైవింగ్ చేయాలని, లైసెన్స్‌తోపాటు ఇతర పత్రాలు కలిగి ఉండాలని, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అడ్డాల దగ్గర సీరియల్ పాటించాలని, ప్రతీ ఆటో వెనుక టాప్ నెంబర్ ఉండాలని తెలిపారు. మద్యం సేవించి ఆటో నడిపితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాలవేణి అశోక్, అర్బన్ అధ్యక్షుడు దొంగల రమేష్, నాయకులు నోముల సంపత్, బొడ్డుపల్లి రవి, అల్వాల అంజయ్య, చొప్పరి రమేష్, రాజకుమార్, దయాకర్ పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఎంఈఓలు

భూపాలపల్లి అర్బన్ : విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం తగదని ఎంఈఓలు దేవానాయక్, ప్రభాకర్, డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన దీక్షలకు మంగళవారం ఎంఈఓలు మద్దతు తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. అన్ని అర్హతలు కలిగి విపరీతమైన పని ఒత్తిడిలో 16 ఏళ్లుగా నామమాత్రపు వేతనంతో పని చేస్తున్నట్టు తెలిపారు. శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో కుటుంబ పోషణ సైతం ఇబ్బందిగా మారిన దుస్థితి నెలకొందని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా జేఏసీ జిల్లా నాయకులు వేణు, చాంద్‌పాషా, మహేందర్, చంద్రకళ, సంపత్, చంద్రమౌళి, కుమార్, హరీష్, రాజు, తిరుపతి, రాజయ్య పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండితే ఓటు తప్పనిసరి



మల్హర్ : అవగాహన కల్పిస్తున్న రవీందర్

మల్హర్ : అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండితే తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్ తెలిపారు. మండలంలోని ఆ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదుపై మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత ఓటును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటరు పాత్ర, ఓటు హక్కు ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం : మండలంలోని మహదేవపూర్ ప్రభుత్వ కాలేజీలో ఎన్ఎస్ఎస్ పీఓ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ప్రసాద్ మాట్లాడారు. ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించారు. ఓటు విలువ తెలుసుకొని సరైన నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు.

కోతులు, కుక్కల స్వైరవిహారం

టేకుమట్ల : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ కోతులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. అవి దాడులకు పాల్పడుతుండడంతో మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం ఇళ్లల్లోకి కోతులు వస్తూ నానా బీభత్సం సృష్టిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అన్ని గ్రామాల్లోనూ కుక్కలు పదుల సంఖ్యలో గుంపుగా సంచరిస్తూ రోడ్డు వెంట వెళ్తున్న పాదచారులను, ద్విచక్ర వాహనదారులను వెంట పడి కరుస్తున్నాయి. మండలంలోని బూర్నపల్లిలో మంగళవారం నేరెళ్ల కొమురయ్య, చిన్నయ్య కోతుల దాడిలో గాయాల పాలవగా ఆశిరెడ్డిపల్లిలో మారుతీ అనే బాలుడు కుక్క కాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ కుక్కలు, కోతుల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్ జీవితంపై నాటక ప్రదర్శన



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

భూపాలపల్లి రూరల్ : జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ మాత రమాబాయి ఆశయం, లక్ష్యాలు, జీవిత చరిత్రపై సంఘం, శరణం, గచ్ఛామి⁈ పేరుతో జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ హౌజ్‌లో నాటకాన్ని మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. ప్రదర్శన ఉత్తేజాన్నినింపిందని చెప్పారు. కార్యక్రమంలో అకాడమీ ప్రాజెక్టు డైరెక్టర్ జగ్గారాజు, మేనేజర్ జక్కిడి నర్సింహారెడ్డి, మహేష్, కళాకారులు దేవేంద్ర, శివప్రసాద్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు, జిల్లాలోని వసతి గృహాల అధికారులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు భద్రయ్య, వివిధ సంఘాల నాయకులు సంతోష్ నాయక్, భీముని సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నిక

చిట్యాల : మండల కేంద్రంలో మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముల్కనూరి భిక్షపతి వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మేడిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఓదేల రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురహరి భానుచందర్, ఉపాధ్యక్షులుగా ఓదేల రాజేష్, మురహరి సాంబయ్య, శ్రీరాముల శ్రీనివాస్, తూముల కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా సూత్రపు నాగవంశీ, చెన్న శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, రాజు, కోశాధికారిగా విజయ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా మురహరి తిరుపతి, గౌరవ అధ్యక్షుడుగా తూముల ప్రసాద్, ముఖ్య సలహాదార్లుగా మేడిపెల్లి కనుకయ్య, మామునూరి వీరస్వామి, తూముల వెంకటయ్య, సంజీవ్, భాస్కర్ ఎన్నికైనట్టు తెలిపారు.

ఏబీవీఎఫ్ మహిళా..

కాటారం : ఆల్ ఇండియా శ్రీవిరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ (ఏబీవీఎఫ్) మండల అధ్యక్షుడు వంగళ దేవేంద్రాచారి ఆధ్వర్యంలో గ్రామ కమిటీని స్థానిక అయ్యప్ప ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా రూపాలక్ష్మి, అధ్యక్షురాలిగా నర్సింగోజు సరిత, ఉపాధ్యక్షురాలగా కందాల నవ్య, ప్రధాన కార్యదర్శిగా కసహోజుల రజిత, కోశాధికారిగా గౌరోజు సుజాత, జాయింట్ సెక్రటరీగా గణముక్కల అంజలి, విశ్వకర్మ కోఆర్డినేటర్లుగా మడుప దివ్యశ్రీ, పోలోజు కళ్యాణి, ప్రచార కార్యదర్శులుగా స్వప్న, ముఖ్యసలహాదార్లుగా సరోజన, సౌజన్య, సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మి, సభ్యులుగా శ్రీలత, సౌందర్య, శ్రీదేవి తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సరోజన, పంచకోటి లక్ష్మి, ఉమాదేవి, రజిత పాల్గొన్నారు.

రజక సంఘం..

కాటారం : రజక సంఘం కాటారం గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పున్నం రాజయ్య, అధ్యక్షుడిగా ముసాపురి నర్సయ్య, ఉపాధ్యక్షుడుగా గుండ్లపల్లి అశోక్, ప్రచార కార్యదర్శిగా పున్నం సతీశ్, కోశాధికారిగా పున్నం శంకర్, ప్రధాన కార్యదర్శిగా పైడాకుల మహేందర్, ముఖ్యసలహాదార్లుగా సురేశ్, ముసాపురి అయిలయ్య, సభ్యులుగా అంజయ్య, శ్రీనివాస్, సమ్మయ్య, మల్లయ్య, సురేశ్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, రాంచంద్రం, వెంకటస్వామి, ఎన్నికయ్యారు.

15 నుంచి ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలు

కాటారం : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమ బాలుర పాఠశాలలోని మైదానంలో ఈనెల 15, 16 తేదీల్లో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ దేవానాయక్ తెలిపారు. ఆ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్స్, సెలక్షన్స్ నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్లు వెంట తీసుకొని 15న ఉదయం 9 గంటలలోగా కోఆర్డినేటర్ మంథని శ్రీనివాస్‌కు రిపోర్ట్ చేయాలన్నారు. వివరాల కోసం సెల్ నంబర్ 9951421678లో శ్రీనివాస్‌ను లేదా సెల్ నంబర్ 7337439849లో పీఈటీ రాధను సంప్రదించాలని తెలిపారు. అండర్–14 కబడ్డీ విభాగంలో బాలురు 51, బాలికలు 48 కిలోలు, అండర్–17 బాలుర విభాగంలో 55 కిలోలు, బాలికలు 55 కిలోలు మించకూడదని తెలిపారు.

రేపటి నుంచి ఎంపిక

టేకుమట్ల : 67వ ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడాపోటీలకు రేపటి (గురువారం) నుంచి స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఎంఈఓ కోడెపాక రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు ఖోఖో, ఖబడ్డీ, వాలీబాల్ క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్లతో నేడు (బుధవారం) హైస్కూల్‌లో కోఆర్డినేటర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆనంద్‌కు అందజేయాలని సూచించారు.

హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు నడిపించండి



డీఎంను సన్మానిస్తున్న జెడ్పీటీసీ అరుణ

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం నుంచి మంథని, పెద్దపల్లి, కరీంగనర్ మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపించాలని డిపో మేనేజర్ రాజశేఖర్‌ను జెడ్పీటీసీ గుడాల అరుణ కోరారు. ఆర్టీసీ అధికారులు రూట్‌ను పరిశీలించడానికి మంగళవారం రాగా తొలుత డీఎంను అరుణ శాలువాతో సన్మానించారు. అనంతరం డీఎంతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఉద్యోగులు, వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎంజల్, ఎస్డీఐ గోపాల్, సిబ్బంది చంద్రమౌళి, రమేష్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న సిబ్బంది

గణపురం : ఈజీఎస్‌లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీఓ పురుషోత్తం స్పష్టం చేశారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 15వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2021 సెప్టెంబర్ నుంచి 2023 మార్చి వరకు రూ.9.16 కోట్లతో చేపట్టిన 466 పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. ఉపాధి పనులు, కూలీల వేతనాలు, సామగ్రి ఖర్చుల వివరాలను తెలిపారు. హరితహారంలో నాటిన మొక్కల్లో ప్రస్తుతం బతికి ఉన్న వాటి వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు వివరించారు. అనంతరం డీఆర్డీఓ పురుషోత్తం మాట్లాడారు. అవకతవకలు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో క్యూఎల్ ధరంసింగ్, జిల్లా విజిలెన్స్ అధికారి రూబీనా, ఎస్డీఎం వేణు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కుడుదుల వెంకటేశ్

భూపాలపల్లి రూరల్ : అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా గౌరవ అధ్యక్షుడు కుడుదుల వెంకటేష్ విమర్శించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెను మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులు 20 రోజుల క్రితం ప్రభుత్వానికి నోటీసు ఇచ్చినా పట్టించుకోలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను రెగ్యులరైజ్ చేయాలని. ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, ఆ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఆముదాలపెల్లి త్రివేణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్ఓ దేవేంద్ర

కాళేశ్వరం : అవగాహన పెంచుకుంటే అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయొచ్చని షీ టీం డబ్ల్యూహెచ్ఓ దేవేంద్ర తెలిపారు. షీ టీం జిల్లా ఇన్‌చార్జ్ అజయ్, ఎస్సై శ్రీలత ఆదేశాల మేరకు మహదేవపూర్ మండలంలోని సూరారం ప్రభుత్వ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి దేవేంద్ర మాట్లాడారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో షీ టీంకు సెల్ నంబర్ 872658162కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాజిద్, కానిస్టేబుల్ నరేష్, ఇర్ఫాన్, శిరీష పాల్గొన్నారు.

క్రియాశీలకంగా వ్యవహరించండి



మాట్లాడుతున్న సీఈఓ విజయలక్ష్మి

భూపాలపల్లి రూరల్ : ఓటరు నమోదులో అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించాలని జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి సూచించారు. జెడ్పీ కార్యాలయంలో మండల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించడం, ఇతర సవరణల కోసం సమగ్ర సర్వే చేపట్టాలని చెప్పారు. ఎవరైనా మిగిలిపోయి ఉంటే వారి వివరాలు సంబంధిత ఫారాల్లో నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఎంపీఓ నాగారాజు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే వీరభద్రీయ కులస్తుల అభివృద్ధి



భూపాలపల్లి రూరల్ : పనులు ప్రారంభిస్తున్న మహంకాళి భూపతి, తదితరులు

భూపాలపల్లి రూరల్/భూపాలపల్లి అర్బన్ : ఐక్యంగా ఉంటేనే వీరభద్రీయ కులస్థులు అభివృద్ధి చెందుతారని వీరభద్రీయ కుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి భూపతి తెలిపారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన వీరభద్రీయ భవన స్లాబ్ పనులను రాష్ట్ర గౌరవ సలహాదారు కర్నె శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి కదారి యాదగిరిలతో కలిసి మహంకాళి భూపతి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సహకారంతోనే భవన నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి ఎమ్మెల్యేగా గండ్ర వెంకట రమణారెడ్డిని గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసి పత్రాన్ని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాణాల రాములు, జిల్లా అధ్యక్షుడు మల్యాల శ్రీనివాస్, కౌన్సిలర్ శారద నారాయణ, పార్టీ అర్బన్ అధ్యక్షుడు జనార్ధన్, మండల అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన మహాముత్తారం

● రేగులగూడెంలో భారీగా జ్వరపీడితులు



జ్వర పీడితురాలు

మహాముత్తారం : మండలంలోని పాత, కొత్త రేగులగూడెంతోపాటు బోర్లగూడెం, పోచంపల్లి గ్రామాలు జ్వర పీడితులతో మంచంపట్టాయి. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సైతం చేపట్టని పరిస్థితుల్లో దోమలు వ్యాప్తి చెందున్నాయి. సుమారు 20 రోజులుగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలానికి చెందిన చీపురు మధునమ్మ, కోట స్వామి, లచ్చక్క, దుర్గ, కొండేటి శ్రీలత, నర్సక్క, లక్ష్మీతోపాటు పలువురు జ్వరాలతో బాధపడుతున్న దుస్థితి నెలకొంది. ఆర్ఎంపీలతో వైద్యం చేయించుకున్నా జ్వరాలు తగ్గడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడాన్ని జిల్లా అధికార యంత్రాంగం, వైద్య శాఖ విస్మరించాయని పలువురు మండిపడుతున్నారు. బోర్లగూడెంకు చెందిన ఐర్నేని సుభాషిణి సుమారు వారం రోజులుగా డెంగ్యూతో బాధపడుతోంది. జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతోంది. వైద్యాధికారులు సత్వరమే స్పందించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.